# జలక్రీడలు

1. చెన్నరంగవాసా పన్నగశయన రంగధామా........
కన్నెల జలక్రీడా .... కృష్ణుని చిన్నెలు వినరమ్మా। ॥ చె ॥

2. రేపల్లెలో ఉన్నా చక్కని గోపిక స్త్రీలంతా .....
రేపునే మాపునే కోపునే మీరిటు తాపుని వనమునకూ। ॥ చె ॥

3. ఇందువదనరావే కొలనుకు మందగమని రావే .....
చందన గంధరావే .... ముత్యపు బిందు బోడిరావే। ॥ చె ॥

4. గోపిక స్త్రీలంతా వలువలు మూటలు కట్టుకొని .....
జోగుతూను ఆ కొలనుకు పోయిరి తామరలటు చూచి। ॥ చె ॥

5. తామరలటు చూచి భామలు కోమలమాయెననీ .....
కామిని భీమం జేమన వచ్చును సోమకళలు కాంచన్। ॥ చె ॥

6. చెట్టులు చూచుచునూ చెలువలు శృంగార కన్నెకలూ.....
దిట్టతనంబున పట్టువలువలటు పెట్టి కొలను కేగన్। ॥ చె ॥

7. మునుగుచు తేలుచునూ .... జలములా ముచ్చటలాడగనూ...
అనవుగ కృష్ణుని ఘనముగ కన్నాని ఘనముగ పాడగనూ। ॥ చె ॥

8. ఆటలు ఆడుచునూ నీళ్ళలా ధాటిగ దుముకుచునూ .....
సూటిగ మునుగుచు పాటలు పాడుచు బోటులు ఈదుచునూ। ॥ చె ॥

9. నీళ్ళలా మునుగుచునూ అలసి చలికి వణంకుచును .....
బాలలార వినరే సుశీల జాలము నవ్వుచునూ। ॥ చె ॥

10. క్రీడలు ఈ రీతి జలములా వేడుకలాడగనూ .....
దూడలు మేపే కోడెగాడు వడి దారిని వచ్చెగదే। ॥ చె ॥

11. ఏకాంతంబుననూ కృష్ణుడు ఆ కాంతల చూచే .....
శ్రీకాంతంబుననూ .... కృష్ణుడు - భూకాంతుండాగెన్। ॥ చె ॥

12. వనమున దూకుచునూ వరుసగ వృక్షన కెక్కుచునూ .....
వనితరో చీరలు యిచ్చుటు లేవని మనమున గుందుచును। ॥ చె ॥

13. ఓయమ్మలార వినరే! మనలెవ్వరో దొమ్మి చేసినాడు .....
కమ్మలటు చీరలు నెమ్మది నెత్తుక ఎందు బోయెగాదే। ॥ చె ॥

14. వానిచూతము రండే వాడు ఎక్కడ ఉన్నాడో .....
ఎక్కువ మిక్కిలి చక్కని రెక్కలు గుక్కున విరుతాము। ॥ చె ॥

15. తురతి పువ్వుల చీర భామది దుష్టవన్నె రవికా .....
ముదితెల్లని చీర .... నిన్న మా బోయెడు కొన్న రవికా। ॥ చె ॥

16. సాలంచుర చీరా భామది సరిగంచుల రవికా .....
మర్రిపండు చీరా భామది మరియు పట్టు రవికా। ॥ చె ॥

17. కొమ్మలు గల చీరా కోట కొమ్మలు గల రవికా .....
బొమ్మంచుల చీరా .... నిండా మొగ్గలు గల రవికా। ॥ చె ॥

18. నెమలి కన్నుల చీరా (భామది) నేరేడు పూత వన్నె రవికా....
నెలతరో చామంతి చీర మరియు పట్టు రవికా। ॥ చె ॥

19. బాలామణి చీరా.... బంగరు మెరపు వన్నె రవికా.....
భామది జల్తారు గళ్ళ చీర మరియు నల్ల రవికా। ॥ చె ॥

20. పట్టిమాటలు కాదూ.... గొల్లడు అట్టై కొన్న (రవికా) చీరా.....
చట్టె పాలు పోసి బజారున అట్టై కొన్న రవికా। ॥ చె ॥

21. పసుపు పచ్చ చీరా .... భామిది ఆకుపచ్చ రవికా .....
పచ్చ రంగు చీరా .... తెల్లని పట్టుపాలు రవికా । ॥ చె ॥

22. చిత్రవన్నె చీరా .... భామిది చిత్రవన్నె రవికా .....
రత్నకాంతి చీరా .... చిత్రకళ మించు కళల రవికా । ॥ చె ॥

23. యిన్ని అన్ని గావా .... చీరలు అన్ని దొంగిలించి .....
ఎటుబోయెను చూడు అటునిటు తడబడలాడుచునూ । ॥ చె ॥

24. ఓయమ్మలార వినరే .... మనిళ్లలా వెన్నదొంగ వీడు .....
కన్ను సంజ్ఞ చేసే .... గొల్లడు పొన్నమాను మీద । ॥ చె

25. నందుని సుతుడివరా .... కృష్ణా పరశురాముడివరా .....
దశరథ సుతుడివరా .... కృష్ణా జనకునల్లుడివరా । ॥ చె ॥

26. మత్స్య కూర్మ వరాహా .... కృష్ణా మచ్చికలో నివరా .....
వాదులు మాతోనా కృష్ణా - నారసింహుడివరా । ॥ చె ॥

27. వలువలివర కృష్ణా .... వామన దేవ కలికమూర్తీ .....
వందన మిదిగోరా (కృష్ణా) బౌద్ధావతార పలుకవేరా । ॥ చె ॥

28. మాధవ మమ్మేలు కృష్ణా మా వలువలు యిమ్మా .....
మా పతులు విన్నా కన్నా మా బ్రతుకెట్లన్నా । ॥ చె ॥

29. ఒక్క చేతితోను స్త్రీలు మ్రొక్కితే ఒప్పనని .....
రెండు చేతులెత్తి మ్రొక్కితే వలువలు యిచ్చెదనూ । ॥ చె ॥

30. ఎంత కొంటెవార ఎరుగని దేమి లేదు వింత.
సరసమటరా చింతా వింతా సిగ్గాయెర ఎంతా । ॥ చె ॥

31. అందెలు అదరగనూ సందెడు దండలు మ్రోయగనూ .....
రెండు చేతులెత్తి స్త్రీలు గోవిందాయనిరి । ॥ చె ॥

32. హస్త కంకణములు స్వరములు అరసి మ్రోయగను .....
కుందరదన గోవింద మాధవుడు అన్ని చీరలిచ్చే । ॥ చె ॥

33. ధర అమలాపురమూ వర గోప బాలుని దయలోను .....
మరువకయో గంటి నృసింహదాసు రచించిన జలక్రీడా । ॥ చె ॥